# వరంగల్ ఘటనల గురించి ఆలోచిద్దాం

# పోలీసుల బీభత్సకాండకూ, దానికి అనుమతి ఇస్తున్న ప్రభుత్వ విధానాలకూ వ్యతిరేకంగా ఆందోళన చేద్దాం

ప్రజలారా!

డాక్టర్ ఆమెడ నారాయణ హత్యతో మొదలయి వరంగల్‌లో వరుసగా జరిగిన సంఘటనలు ఆ జిల్లా పోలీసు యంత్రాంగం నడవడిక గురించి మరొకసారి చర్చ లేవదీసాయి.

పోలీసు యంత్రాంగానికి ఉండే అధికారాలకు ఏ పరిమితులూ లేవనీ, ఏ ప్రమాణాలూ వర్తించవనీ నమ్మడం వరంగల్ పోలీసుల ప్రత్యేకత కాదు. పోలీసు వ్యవస్థ దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ అదే రకంగా వ్యవహరిస్తున్నది. ఆ వ్యవహార శైలి కేవలం పోలీసు వ్యవస్థలో పుట్టిన ఆలోచన కాదు. అది ఈ దేశ పరిపాలనా నీతిలో భాగం. ఈ దేశాన్ని ఏలిన, ఏలుతున్న సకల పాలక పార్టీల విధానంలో భాగం. పౌరుల ప్రాథమిక హక్కులనూ, ప్రజాస్వామ్య విలువలనూ గౌరవించే ప్రమాణాలను పోలీసు యంత్రాంగం అనుసరించేటట్టయితే ఈ దేశాన్ని ఏలడం సాధ్యం కాదని అన్ని పార్టీల వారూ నిర్ణయించుకున్నారు. అందుకే ఏ పార్టీ పాలనలోనూ ఈ విషయంలో ప్రజలకేమీ తేడా కనిపించదు.

కానీ చట్టం అనుమతించని విచ్చలవిడి అధికారాన్ని విపరీతస్థాయికి తీసుకుపోయిన చరిత్ర వరంగల్ జిల్లా పోలీసు యంత్రాంగానికి ఉంది. వేరే ఏ జిల్లాలోనూ లేనంతగా ఆ జిల్లాలో ఎందుకుందని చర్చించడం మా ఉద్దేశ్యం కాదు. ఆ విచ్చలవిడి ప్రవర్తన క్రింద నలిగిపోయే ప్రజల గురించి, ప్రజాస్వామ్య జీవిత విలువల గురించి, ఆందోళన చేయమని మిమ్ములను కోరుతున్నాం.

రాజ్యాంగం ఇచ్చిన అధికారం చేతిలో ఉన్నవాళ్ళే అరాచకంగా ప్రవర్తించడం మొదలుపెడితే, వాళ్లను అదుపు చేయడానికి అంతకు మించిన అధికారమేదీ వ్యవస్థలో ఉండదు. మామూలు జనం చట్టాన్ని ఉల్లంఘిస్తే అదుపు చేయవలసింది వాళ్లే. కానీ వాళ్లే చట్టాన్నీ, పౌరహక్కులనూ ఖూనీ చేస్తే అదుపు చేయడానికి ఎవరున్నారు?

కోర్టులున్నాయి. కానీ కోర్టులు న్యాయం చేయాలంటే అధికార యంత్రాంగం సహకారం కావాలి. కోర్టులు జారీ చేసే ఆదేశాలను అధికార యంత్రాంగమే అమలు చేయాలి, లేదా అమలయ్యేటట్లు చూడాలి. కోర్టులు అధికార యంత్రాంగాన్నే ముద్దాయిగా నిలబెట్టి విచారణ నిర్వహిస్తే దానికి అధికార యంత్రాంగం సహకరించాలన్నా, లేక కోర్టులు అధికార యంత్రాంగాన్నే తప్పుపడుతూ ఆర్డర్లు జారీ చేస్తే వాటిని కూడా అధికార యంత్రాంగం సమభావంతో అమలు చేయాలన్నా, దేశ పరిపాలనలో ప్రజాతంత్ర రాజకీయ సంస్కృతి బాగా అభివృద్ధి చెందవలసి ఉంటుంది. మన దేశ పాలకులకు అంతటి ప్రజాతంత్ర స్పృహ ఇంకా రాలేదు. అధికార యంత్రాంగం పాల్పడే అక్రమాలకు వ్యతిరేకంగా ఎప్పటికప్పుడు ప్రజలు గళంవిప్పి నినదించడం నేర్చుకుంటేనే ఆ ప్రజాతంత్ర స్పృహను పాలనా వ్యవస్థకు నేర్పించగలుగుతాం. ఇదొక నిరంతరం జరగవలసిన కృషి. ఆ క్రమంలోనే అధికార విధి నిర్వహణ నియమబద్ధం అవుతుంది. మన హక్కులకు లోబడి నడవడం నేర్చుకుంటుంది. ఆ క్రమంలోనే కోర్టులు మన హక్కులు కాపాడడానికి కావలసిన బలాన్ని సంపాదించుకోగలుగుతాయి. న్యాయవ్యవస్థ నిజంగా న్యాయం చేయగలరూపం తీసుకుంటుంది.

విచ్చలవిడి అధికారాలను పాలనా వ్యవస్థ చలాయించడం మొదలుపెడితే, దానికి బలయ్యేది సమాజంలోని బలహీనులయినవారే. కులం, డబ్బు, హోదా, అధికారం, స్థితిగతులు లేనివారే. అందువల్ల అధికార అరాచకత్వం సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకొక ముఖ్య సమస్య. దానిని ఎదుర్కొనడం ఆ ప్రజలకొక ముఖ్య అవసరం.

## డాక్టర్ ఆమెడ నారాయణను పోలీసులు ఎందుకు చంపారు?

ఆమెడ నారాయణ 38 సంవత్సరాల వయసున్న ప్రజావైద్యుడు. 'ప్రజా వైద్యశాల' అనే బోర్డు మన రాష్ట్రంలో చాలామంది డాక్టర్లు పెట్టుకున్నారు కానీ ఆ పేరు నిజంగా అతికే కొద్దిమంది వైద్యులలో ఆమెడ నారాయణ ఒకడు. ఆయనను పోలీసులు చంపేస్తే 'మాదేవుడిని చంపారు' అని మొగిలిచర్ల గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామస్తులు ఒక్క గొంతుతో రోదించారు. మృతదేహం దగ్గర వేల సంఖ్యలో గుమిగూడి పోలీసులపైన దుమ్మెత్తిపోసారు. ప్రజలలో, అందులోనూ పేద ప్రజలలో అంతటి అభిమానం సంపాదించుకున్న డాక్టర్లు దేశంలో కొద్దిమందే ఉంటారు.

నారాయణ వరంగల్ జిల్లాలోని ఒక మారుమూల మండల కేంద్రమైన కొరివి అనే గ్రామానికి చెందినవాడు. కుండలు చేసుకొని బ్రతికే కుమ్మరి కుటుంబంలో పుట్టాడు. హైస్కూల్ చదువుకునే రోజులలో కులవృత్తి చేసుకుంటూ చదువుకునేవాడు. కాకతీయ మెడికల్ కాలేజీలో చదువుకుంటుండగా రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. డాక్టర్ అయిన తరువాత తన తల్లిదండ్రుల బోటి గ్రామీణశ్రామిక ప్రజలకు తన జ్ఞానాన్నీ నైపుణ్యాన్నీ అందించడం తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్నాడు. నారాయణే నిజమైన వైద్యుడు. వైద్య జ్ఞానాన్ని సొమ్ము చేసుకునే వైద్యవ్యాపారులకన్నా, తమ నైపుణ్యానికి డాలర్లలో వెలకట్టి విదేశాలకు వలసపోయే వైద్యపట్టభద్రులకన్నా నారాయణే నిజమైన వైద్యుడు. వైద్య సేవల వ్యాపారీకరణ శరవేగంగా పురోగమిస్తున్న ఈ రోజులలో పేదప్రజలకు నారాయణ వంటి డాక్టర్ల అవసరం చాలా ఉంది. 'నా ఫీజు ఇంత. అది ఇస్తేనే వైద్యం చేస్తాను' అని నారాయణ ఎన్నడూ అని ఎరుగడు. తన దగ్గరకు వచ్చే వాళ్ల అవసరమే తప్ప వాళ్లు తనకు ఇచ్చుకోగల ఫీజు ఎంత అనేది అతనికి ఏరోజూ ప్రమాణం కాదు.

మెడిసిన్ చదువు పూర్తి చేసి హౌస్ సర్జన్‌గా ఉన్నప్పుడు అతను వృత్తిని అభ్యసించడం కోసం పౌరహక్కుల డాక్టరు రామనాథం గారి క్లినిక్‌కు వచ్చేవాడు. 1983లో అతను మొగిలిచర్లలో తన క్లినిక్ తెరిచినప్పుడు డాక్టర్ రామనాథమే ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథి. ఆ తరువాత కొంతకాలం డాక్టర్ రామనాథం అతని క్లినిక్‌కు మందులు పంపించేవారు. డాక్టర్ రామనాథంను పోలీసులు 1985 సెప్టెంబర్‌లో కాల్చి చంపారు. డాక్టర్ నారాయణను 1996 సెప్టెంబర్‌లో కాల్చి చంపారు.

సెప్టెంబర్ 25 పొద్దున్న వరంగల్ పట్టణంలోని తన ఇంటినుండి మొగిలిచర్లలోని తన క్లినిక్‌కు స్కూటర్‌పైన పోతున్న డాక్టర్ నారాయణను పోలీసులు దారికాచి చంపారు. ఆ ప్రజా డాక్టర్‌కు ఉన్న ఒక్క బలహీనతను వాడుకొని అతన్ని చంపారు. ఎవరయినా ఎక్కడయినా తన స్కూటర్‌ను ఆపి ఒంట్లోబాగాలేదని వైద్యం చేయమని అడిగితే అక్కడికక్కడే స్కూటర్ నిలిపి వైద్యం చేయడమే తప్ప 'క్లినిక్‌కు రమ్మని' చెప్పి వెళ్లిపోవడం నారాయణకు అలవాటు లేదు. ఆ సంగతి తెలిసిన పోలీసులు అతనిని ఎనుమాముల గ్రామం దగ్గర ఆ విధంగానే ఆపి కాల్చి చంపారు.

'అతనేం నక్సలైటా? లేకపోతే పౌరహక్కుల సంఘం సభ్యుడా? అతనిని మేమెందుకు చంపుతాం?' అని వరంగల్ పోలీసు అధికారులు పత్రికా విలేకరులతో అన్నారు. తాము ఏం మాట్లాడుతున్నారో వాళ్లకు అర్థం అవుతున్నట్టు లేదు. లేక, ఏం మాట్లాడినా అడిగేవాళ్లెవరన్న అహంకారం బలిసిందో. పోలీసులకు ఎవరినీ చంపే అధికారం లేదు. వాళ్లకుండేది నేరాలను నిరోధించే అధికారం, జరిగిన నేరాలను పరిశోధించే అధికారం మాత్రమే.

పోలీసులు చేసే వీరంగం చూస్తే వాళ్లకు ఇంకా ఏమేం అధికారాలు ఉన్నాయో అనిపించవచ్చును. తాము డాక్టర్ నారాయణను చంపినట్టు పోలీసులు ఒప్పుకోవడం లేదుగానీ, చేసినట్టు ఒప్పుకోని ఆ ఘోరానికి ఒక కారణం మట్టుకు చూపిస్తున్నారు. నారాయణ నక్సలైట్లకు వైద్యం చేసేవాడు అనే 'నింద'ను ప్రచారం చేస్తున్నారు. నక్సలైట్లకు నారాయణ వైద్యం చేసే ఉండవచ్చును. వైద్య సహాయం అవసరమయి ఎవరు తన దగ్గరకు వచ్చినా వైద్యం చేయడం డాక్టరు నిరాకరిస్తే అది తప్పు అవుతుంది కానీ చేస్తే తప్పు కాదు. నారాయణ నక్సలైట్లకే కాదు, మొగిలిచర్లలో నక్సలైట్లు ఎవరినయినా కొట్టి పోయినా వాళ్లకు కూడ ట్రీట్‌మెంట్ ఇచ్చేవాడని ఆ గ్రామ ప్రజలు అంటున్నారు.

తెలంగాణా గ్రామాలలోని డాక్టర్లందరిపైనా ఈ 'నింద' వేయవచ్చును. డాక్టర్ నారాయణ పీపుల్స్ వార్ సానుభూతి పరుడే అయి ఉండవచ్చును. కాని డాక్టర్లు నక్సలైట్లకు కూడా వైద్యం చేస్తారు. అది వాళ్ల వృత్తి కాబట్టి చేయక తప్పదు. అది సాకుగా చూపించి తెలంగాణా గ్రామాలలో డాక్టర్లను హతమార్చడం మొదలు పెడితే ప్రజలకు వైద్యం చేసేవాళ్లు మిగలరు. నిజానికి ఈ సంవత్సరం నారాయణే కాక మరొక ఇద్దరు గ్రామీణ వైద్యులను కూడ తెలంగాణాలో పోలీసులు చంపారు. అయితే వాళ్లు ఆర్.ఎం.పిలు కావడం వల్లనో, లేక నారాయణ హత్యలాగ మిస్టరీగా మిగిలించకుండ పోలీసులు వాళ్ల హత్యను 'ఎన్‌కౌంటర్'గా చూపించడం వల్లనో గాని అవి సంచలనం సృష్టించలేదు. ఆ యిద్దరిదీ కరీంనగర్ జిల్లా. ఇద్దరిపైనా 'నింద' ఒకటే. 'నక్సలైట్లకు వైద్యం చేస్తున్నారు' అనేది. ఇట్లా కొనసాగితే త్వరలో డాక్టర్లంతా తెలంగాణా గ్రామాలను వదిలిపెట్టి వెళ్లిపోయినా ఆశ్చర్యపోవలసిన పనిలేదు. అసలే ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అంతరించి పోతున్న ఈ దశలో తెలంగాణా ప్రజలకు పెద్ద ముప్పు వచ్చి పడనుంది.

## అక్టోబర్ 7 నాటి బీభత్సం

అక్టోబర్ 7 పొద్దున్న వరంగల్ జిల్లా ములుగు సమీపంలోని జాకారం దగ్గర పీపుల్స్‌వార్ నక్సలైట్లు రహదారి పైన మందుపాతర పేల్చి ఒక సిఐతో సహా ఏడుగురు పోలీసు సిబ్బందిని చంపారు. చనిపోయిన వాళ్లు ట్రాఫిక్ పోలీసులు. నక్సలైట్లకు తాము పేల్చి వేస్తున్న జీపులో ఎవరున్నారో తెలీదు. అది పోలీసు వాహనమని పేల్చి వేసారు. దీనిఫలితంగా, నక్సలైట్లు ఏ నిర్బంధకాండకు వ్యతిరేకంగానయితే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారో ఆ నిర్బంధకాండతో సంబంధం ఉందో లేదో తెలియని వ్యక్తులు కేవలం పోలీసు ఉద్యోగులయినందుకు బలికావలసి రావడం చాలా దారుణమైన విషయం.

ఆ తరువాత వరంగల్ పట్టణంలో పోలీసులు పాల్పడిన బీభత్సకాండ ఆ ఊరిని వణికించి వేసింది. ఎవరయినా ప్రైవేట్ గూండాలు ఆ రకంగా ప్రవర్తించినా ప్రజలు భీతిల్లుతారు. పోలీసులు వస్తారులే, అదుపు చేస్తారులే అని ఎదురు చూస్తారు. కానీ పోలీసులే ఆయుధాలు చేతపట్టుకొని వీధులలో స్వైరవిహారం చేస్తుంటే ప్రజలు ఎవరి రక్షణ కోరాలి? ఎవరు కాపాడుతారని ఎదురు చూడాలి? పోలీసులు మఫ్టీలో కర్రలు, ఇనుపరాడ్లు, తుపాకులు పట్టుకొని వరంగల్ పురవీధులలో గూండాల లాగ విహరించారు. రోడ్లు ఖాళీ చేయించే ఆరాటంలో అందరినీ చితక బాది తరిమారు. తాము ఎవరో, ఎందుకు బంద్ చేయిస్తున్నారో చెప్పకుండా బలవంతంగా దుకాణాలు మూయించారు. ఆటోలను ఆపి అద్దాలు పగలగొట్టి ప్రయాణీకులను బలవంతంగా బయటకు లాగి పడేసారు. కనీసం ఇద్దరు స్త్రీలు తీవ్రంగా గాయపడ్డారని వార్త. కార్లపైన, బస్సులపైన దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. బస్సులపైన దాడి చేస్తున్న దెవరో అర్థంకాక ప్రయాణీకులు దిగి పారిపోయారు. ఈ స్వైరవిహారానికి పోలీసులకు వాహనాలు అవసరం అయి ఒక షోరూం నుండి స్కూటర్లు అపహరించి తీసుకొని పోయారు. ఆటోలు ఎక్కి బలవంతంగా ఊరంతా తిప్పారు. కాంగ్రెస్ నాయకులను సహితం ఆరోజు పోలీసులు విడిచిపెట్ట లేదు.

పోలీసులు ఏం చేసారన్నదానికన్నా ఎందుకు చేసారనేది ముఖ్యం. వాళ్ల సహచరులు చనిపోయినందుకు వాళ్లకు కోపం వచ్చిందంట. అందుకని వాళ్లు ఈ ప్రపంచంమీదనే ప్రతీకారం తీర్చుకుంటారంట. జాకారం దుర్ఘటన పట్ల సంతాపం చెందేవారు సహితం ఈ తర్కాన్ని ఒప్పుకోలేరు. ఒప్పుకోకూడదు. ఒక నాగరిక సమాజంలో ఎటువంటి ప్రతీకారానికీ తావు ఉండకూడదు. అందులోనూ అధికారం చేతిలో ఉన్నవాళ్లు, ఇతరుల విచ్చలవిడి ప్రవర్తనను అదుపుచేసే బాధ్యత తమ మీద ఉన్నవాళ్లు, అందుకోసం అధికారికంగా ఆయుధాలు ధరించిన వాళ్లు, దానికి గుర్తుగా యూనిఫారాలు వేసుకున్నవాళ్లు, ప్రతీకారం తీర్చుకోవడం మొదలు పెడితే అది అడవి అవుతుంది తప్ప నాగరిక సమాజం కాదు.

డాక్టర్ నారాయణ హత్యకు కూడ ఇటువంటి ప్రతీకార వాంఛే కారణం అన్న అభిప్రాయం ఉంది. పీపుల్స్‌వార్ నక్సలైట్లు భీంసింగ్ అనే తాద్వాయి పోలీస్ కానిస్టేబుల్‌ను చంపినందుకు ప్రతీకారంగా డాక్టర్ నారాయణను పోలీసులు చంపారన్న అభిప్రాయం ఉంది. అంతకుముందు వర్ధన్నపేట పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఐలిరెడ్డిని నక్సలైట్లు చంపినప్పుడు వరంగల్ పోలీసులు పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులయిన బుర్రా రాములు, అంబటి శ్రీనివాస్లను చంపుతామని బహిరంగంగా నినాదాలు ఇచ్చారు. పౌరహక్కుల నాయకులు డాక్టర్ రామనాధంను 1985లో, జాపా లక్ష్మారెడ్డిని 1986లో, నర్రా ప్రభాకరరెడ్డిని 1991లో పోలీసులు చంపడానికి ఈ ప్రతీకార తర్కమే కారణం. తిరిగి మొన్నటి అక్టోబర్ 7న వరంగల్‌లో పోలీసులు ఒకవైపు పౌరహక్కుల సంఘం నాయకులను చంపుతామనీ, ఒక హత్యకు పది హత్యలు, ఏడు హత్యలకు డెబ్బై హత్యలు అనీ, నక్సలైట్లను నరుకుతాం అనీ నినాదాలు ఇస్తూ, మరొక వైపు వరంగల్ పట్టణ ప్రజలందరిపైనా తమ ఆవేశాన్ని వెళ్ళగక్కారు. వట్టి మాటలతో కాదు, కర్రలతో, ఇనుపరాడ్లతో, తుపాకి మడమలతో వెళ్లగక్కారు.

ఇది ఇక్కడితో ఆగిపోతుందా? లేకపోతే ఈసారి వాళ్లకు కోపం వచ్చినప్పుడు ఏకంగా బజార్లో కాల్పులు జరిపి జనాన్ని హతమారుస్తారా? ఈ ప్రశ్నకు ఎవరు జవాబు చెప్తారు? ఒక నెలరోజులుగా వరంగల్ పోలీసుల ప్రవర్తన రాష్ట్ర వ్యాపితంగా చర్చకు వస్తున్నా నోరు మెదపకుండ ఉన్న ముఖ్యమంత్రి చెప్తాడా? అసలు ముందు తన మౌనానికి అతను సంజాయిషీ చెప్పుకోనవసరం లేదా? జరుగుతున్న ఘోరాలకు బాధ్యత వారిదీ వారి ప్రభుత్వానిదీ కాదా? పోలీసుల విచ్చలవిడి ప్రవర్తన తన ప్రభుత్వ పాలసీలో భాగం కాదా? కనీసం ఇది తప్పనీ ఇక మీదట జరగకుండ చూస్తామనీ అనని ముఖ్యమంత్రి గురించి ఏమనుకోవాలి? ఇట్లాగే జరుగుతుండాలని ఆయన కోరుకుంటున్నాడని అనుకోవాలి కదా?

## బహిరంగ సభ

5-11-96 (మంగళవారం) సా.5.30 గం.లకు

ప్రకాశం పార్క్, విజయనగరం

అధ్యక్షత : పి.అప్పన్న దొర ( ఎ.పి.సి.ఎల్.సి. విజయనగరం జిల్లా అధ్యక్షులు)

వక్తలు : పి.నాగరాజు (ఎ.పి.సి.ఎల్.సి. జిల్లా కార్యవర్గ సభ్యులు)

కె.బాలగోపాల్ (ఎ.పి.సి.ఎల్.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

26 అక్టోబర్ 1996

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)